


"నన్నెక్కడ చూశేవు? బొమ్మెందుకేసేవు? ఊరుముందర ఎందుకు పెట్టేవు?...." అడిగింది, బంగనపల్లి పండంటి కన్నెపడుచు.

"అమ్మాయిగారూ, నిజం చెప్పమంటారా, అబద్ధం చెప్పమంటారా?" అడిగాడు ఆషాఢ.

"గారనకు, సినదాన్ని.... అబద్ధం సెప్పు!" అన్నది సిరిగల చిన్నది.

"కలలో చూశాను, అందరికీ కనువిందు చేయొద్దూ మరి, వేశాను, అంతే! .... ఆ బొమ్మ 'మణెమ్మ' అని తెలీదు!"

"....సర్లే, జరిగిందేదో జరిగేపోయింది,.... మరి నిజం చెప్పు!"

"సెప్తా...."

"ఆగు! నిజం నిలకడమీద నిమ్మళంగా సెప్దువుగాని, ఉండు!...." అని అంటూ మణెమ్మ పక్కగదిలోకి వెళ్లింది....

* * *

జరిగిందేమంటే_, బురదకోటలో చిత్రకళా ప్రదర్శనం పెట్టాలని తీర్మానించారు నలుగురూ.

"ఆషాఢ మాటేమిటి?" అన్నాడు కార్యదర్శి చలమయ్య.

"కళాఖండాల సరసన డబ్బారంగుల బొమ్మలా!! నా చిత్రాలన్నీ ఆర్టిస్ట్ ఆయిల్‌కలర్ ట్యూబులు పిండి వేసినవి! మాడర్న్ ఆర్ట్ పెయింటింగులు!" అన్నాడు నూకేష్_ అనగా నూకరాజు, మస్తుగా ఉన్నవాడు.

"అసల్ కళ బ్రహ్మస్వరూపం! వాళ్లూ వీళ్లూ వేసినవి కళాఖండాలవుతాయా? బోర్డులు, బజారు బొమ్మలు వేస్తూ తిరిగేవాళ్ళ బొమ్మలా మాలాంటి వాళ్ళ ముందు పెట్టేది!!" అన్నాడు డ్రాయింగు మేష్టారు శిరోమణి, ఖారాకిళ్లీ బిగిస్తూ.

"కళ పవిత్రమైంది! కళామతల్లి పవిత్ర పాలాన పవిత్ర కళాకళ్యాణ వేదికపై పవిత్ర కళాకారులే పవిత్ర కళాఖండాలతో పవిత్ర కళ్యాణ కళా తిలకం దిద్దాలి!" అన్నాడు చంగల్రావు, కళా విమర్శకుడుగా పేరెక్కాలని తంటాలుపడుతూన్న విలేఖరి.

చిత్రకళా ప్రదర్శన కమిటి కోశాధ్యక్షుడు చిన్నదొర చుట్టపొగ గుప్పు గుప్పున వొదుల్తూ "తంతే నయాపైసా రాల్దు ఆడికాడ, ఆడి బొమ్మలు మనం యెట్టేదేంటి!" అని మంగళవాక్యం పాడాడు.

చతుష్టయం గ్రంథాలయం వెనక ఆవరణలో కూడబలుక్కున్న వైనం ఆషాఢకి చేరవేసిన మిత్రబృందం, "గురూ! పోటీగా నీ చిత్రాలు వందకి పైగా ఎగ్జిబిషన్ పెట్టితీరాలి!" అన్నారు పిడికిళ్లు ఎత్తి.

తన సరదాకు వేసుకొన్నవి కొద్ది ఉన్నాయి గాని, వారం రోజుల్లో వంద ఎలాగొస్తాయి? మిత్రబృందం పట్టుబడుతూన్నారు....!.... ఆలోచనలో పడ్డాడు ఆషాఢ....

చాలాచోట్ల పెయింటర్లు చిత్రకారుల దగ్గిర పనికి కుదురుకున్నాడు గాని ఎవరూ ఎక్కువరోజు లుంచుకోలేదు. ఒకతను మాత్రం "అబ్బాయి! నువ్వు వేలు చూపితే మంద మింగే రకం! అంచేత నిన్ను చేరనివ్వరు. బతుకుతెరువే గురువనుకో, నువ్వు మంచి చిత్రకారుడి

వయ్యే అవకాశం ఉంది!"అని చెప్పాడు.

ఊరూరా తిరుగుతూ ఆ ఊరొచ్చాడు. ఎందుకో ఆ ఊరు నచ్చింది. కొండలూ, పచ్చని పరిసరాలు, ఏరు, కృత్రిమత పెచ్చుపెరగని వాతావరణం కారణాలు కావచ్చు. ఉండిపోయాడు. 'కో' అంటే దండుగా వచ్చే మిత్రబృందం దొరికింది.

తనా ఊరొచ్చిన కొత్తలో ఆషాఢ పేరు విని విడ్డూరంగా చూశారు ఊళ్లో. తనకా పేరు రావడమే తమాషా!....

* * *

ఆరో తరగతి, పంతులుగారు కథ చెప్తున్నారు— 'ఆషాఢ మాసంలో నాటితే పుష్యమాసంలో పంట వస్తుంది, అంతేగాని ఆషాఢంలో పండదు, ఆషాఢ భూతి అంటే ఆషాఢమాసపు పంట లాంటివాడని అర్థం— చెప్పడం సాగుతూంది.

ఒక కుర్రాడు వేళ్లు లెక్కించి, "పుష్యమాసంలో నాటితే ఆషాఢంలో పంట వస్తుంది కదండి మాష్టారూ!" అన్నాడు.

పంతులు వినిపించుకోకుండానే కథ పూర్తిచేశాడు.

మళ్లీ ఆ కుర్రాడే "దొంగసోము లోరికి మస్కాకొట్టి మాంఛి పన్జేశాడు కదండీ మాష్టారూ ఆషాఢభూతి!" అన్నాడు.

పంతులు కుర్రాణ్ణి దగ్గిరికి పిల్చి గోముగా మొట్టికాయ పెట్టి "ఆ అషాఢ భూతివి నువ్వేరా అబ్బీ! నేలమీద చుక్కలు మొలిపిస్తావులే!" అన్నాడు.

అప్పట్నించి ఆ కుర్రాడి పేరు స్కూల్లో ఆషాఢభూతి అయింది. ఆ తర్వాత్తర్వాత ఆషాఢగా నిల్చింది. తనకా పేరే బాగుంది!

* * *

ఆషాఢ అంటే ఊళ్లో అందరికీ బాగా తెల్సు. సైను బోర్డులు మొదలు ఎనామెల్ రంగుల్తోనే 'తైలచిత్రాలు' చేసియిస్తాడు. చిన్న ఫోటోల్ని పెన్సిల్ షేడ్‌లో పెద్దవి చేస్తాడు. స్కూలు పిల్లలకి సైన్సు బొమ్మలు వేసిపెడ్తాడు. ఏదీ దొరక్కపోతే ఇళ్లల్లో రంగులు కూడా వేస్తాడు.

ఓ సారి ఓ ఆసామీ తైలవర్ణచిత్రం కావాలని ఫోటోలు యిచ్చాడు. ఖరీదైన రంగుల్తో వేసినవి కంటికానలేదేమో, ఆషాఢ వేసిన 'తైలవర్ణ చిత్రాన్నే ఇంట్లో తగిలించుకున్నాడు, ఎనామల్ రంగుల మెరుపు కళ్ళని జిగేల్మనిపించి ఉంటుంది!

ఇంకోసారి నూకేషూ, శిరోమణీ వందలవుతోందన్నదాన్ని తన గడ్డు గడవడానికి వందకు చేశాడు.

ఎన్ని చేస్తున్నా తనకు బుద్ధిపుట్టినప్పుడు చిత్రాలు వేసుకొంటూనే ఉంటాడు. అలాంటివి ఏ కొద్దో ఉన్నాయి. వంద కావాలి! మిత్రబృందం పట్టుదల కాదనలేదు! ఏదో ఒకటి చేయకతప్పదు!

రోడ్డువార్ల అమ్మే కేలండరుబొమ్మలు పెద్దసైజు సినిమా వారపత్రికల బొమ్మలు న్యూస్‌పేపర్లలోని ప్రకటన, ఫోటో కటింగులూ పోగుచేశాడు. తమాషాకి పిల్లలాడుకొనే బొమ్మనోట్లు కట్ట ఒకటి దొరికింది.

కత్తెర చకచక లాడింది. జిగురు అంటించింది.

తారామణుల బొమ్మలకి కుంచె కొత్త కొత్త మేకప్పులు చేసింది.

ఎన్ని తమాషాలు, గారడీలు చెయ్యాలో అన్నీ చేశాడు. అన్నిటిమీదా కుంచె, రంగులూ పరవళ్ళు తొక్కాయి. అట్టలమీద అతికించి, పేర్లుపెట్టి, వంద చిత్రాలూ అయినాయనిపించాడు.

గ్రంథాలయం ఎదురుగా దివాలాతీసిన టీస్టాల్ తాటాకుపాక ఒకటుంది. దాన్ని కలుపుకొని పెద్ద పందిరి తయారైంది. ఆ పందిరి పేరు 'బొమ్మల పందిరి.'

అమ్మవారి జాతరొకటి బాగా కలిసి వచ్చింది. వీళ్ళువాళ్ళు అనకండా అందరూ యధేచ్ఛగా విరగబడి బొమ్మలపందిరి చూశారు.

బొమ్మల పందిరిలో రకరకాల బొమ్మలున్నాయి.

విఘ్నేశ్వరుడు ఎలకని వెనక కూర్చోబెట్టుకొని స్కూటరుమీద రంయ్యిమని మేఘాల్లో వెళ్తున్నాడు.

కారుమీద కైలాసం. కారుకు తాడు కట్టి నంది యీడుస్తున్నది. పార్వతీపరమేశ్వరులు కారుమీద ఊరేగుతున్నారు.

లక్ష్మి విశ్వరూపం అరచేతులో సరస్వతి వీణ వాయిస్తున్నది.




శేషతల్పశాయి నాభి కమలంపై బ్రహ్మ, ఎదురుగా ఎర్ర త్రికోణాలు వెక్కిరిస్తూన్నవి. కింద అల్లకల్లోలంగా రకరకాల బొమ్మలు, అణుశక్తి పరీక్షా మేఘాలు, ప్రమాదాలు, ఒహటేమిటి అన్నీ సముద్రతరంగాల్లాగ— దానిపేరు 'జగవద్గీత,' పెద్దతడకమీద పోస్టరంత చిత్రం— ఇలాంటివి ఎబ్బెట్టుగా అనిపించినా ఒక 'వినోదం'కింద తీసుకుని చూసి ఆనందించారు.

పెద్ద చెట్టునిండా వందరూపాయల నోట్లు. నోరు తెరుచుకొని చూస్తున్న మనిషి, మనిషి వెనక నాలుక చాచుకొని ఒక తొడేలు.

నోట్లతో కూర్చిన అంతస్తులంతస్తుల భవనాలు స్వర్గలోకానికి చొచ్చుకొని, కింద పాతాళలోకంలో పాముపుట్టల్లాగ గుడిసెలు.

పాదచారులై మనుషులమీద లారీలు బస్సులు కార్లు పరుగెడుతున్నాయి. వాటిమీద విమానాలు నడుస్తున్నాయి. వాటిమీద నల్లటి ముసుగులవాళ్లు!! నడుస్తున్నారు.

మరోబొమ్మ - నీళ్ళకోసం క్యూలో కడవలు, అమ్మలక్కల కన్నీళ్ళు వాటిని నింపుతున్నాయి— ఇలాంటివి ఒక 'వింతగా'చూశారు.




సినిమాతారల బొమ్మలకి పల్లె అలంకరణలు చేసినవాటి సంగతి చెప్పక్కరలేదు. నేపథ్యంలో చెరుకుతోటలూ తాటిచెట్లూ ఏర్లూ చెరువులూ కొండలూ, చందమామ మబ్బులు, ఇళ్ళూ వాకిళ్ళూ, తలుపులు ద్వారాలు రూపొందాయి.

ఎదురు తెన్నులు, నిరీక్షణ, వాసకసజ్జిక, అభిసారిక— యిలాంటి పేర్లతో నిమిత్తం లేకుండా ఆడవాళ్ల గుంపులు గుంపులుగా చూశారు.

ఆ జిగినీనాను, ఆ నక్లీసు, ఆ బావిశీలు, కుత్తిగంటు, నాను, ఎత్తిగొలుసులు, బావిశీలు, ఎంత బాగున్నాయే!!!

అహ ఏం తిలకం! ఏం బొట్టు, ఎంత కాటుక!! ఇలాంటి గోలతో చూశారు.

అయితే— అన్నీ ఒక ఎత్తు, 'ఎవ్వరి కోసం.... చెలిమందహాసం' అని కింద ఉన్న ఒకే ఒక చిత్రం ఒక ఎత్తు అయింది. అదే 'మణెమ్మ' అని పెద్ద సంచలనం రేపిన చిత్రం. ఆ పేటలోని ఆడజనమంతా పనిగట్టుకొని వచ్చి ఆ ఒక్క చిత్రాన్నే పదేపదే చూశారు.

చూసి— "మణెమ్మా!, మణెమ్మ లేదూ— ప్రెసిడెంటుగారమ్మాయి, మణి, తిక్కమణి అలాగే దిగిపోయింది." —ఇలాగ మొదలైంది గోల.

మణెమ్మ తండ్రి చిరకాలంగా పంచాయితీ ప్రెసిడెంటుగానే కీర్తిశేషుడు అయ్యాడు, పిల్ల పెళ్లి జరక్కపోయెనే అన్న విచారంతోనే. మంచి మేడ, చెరుకు పొలము, బంగారం పండే మాగాణి, బేంకులో నిల్వ కూతూరు పేర రాసిపెట్టి మరీ పోయాడు.

మణెమ్మ పసిదిగా ఉన్నప్పుడే పసుపు కుంకాలతో తల్లి పోయింది. తండ్రి అతి గారాబంవల్ల పట్టిందే పట్టు, ఎంతంటే అంతేగా పెరిగిందేమో, తర్కబోతుపిల్ల, తిక్కమణి అనిపించుకొంది. ఆ పిల్ల మనస్సులో ఏం ఊహలు పెంచుకుందో గాని, తండ్రి ఎంత మొత్తుకున్నా పెళ్లాడనని మొరాయించుక్కూచుంది.

"తస్సామణినే బొమ్మ దించేశాడు, అషాఢకీ మణెమ్మకీ రాయబారాలు జోరుగా సాగుతున్నాయటలే!"— ఇదీ ఊరంతా చెలరేగిన దుమారం.

మణెమ్మ భీముడిని అడిగింది, ".... నువ్వు చూశావా!" అని.

భీముడు ఆ ఇంటిని కనిపెట్టుకొని ఉన్న నమ్మినబంటు. ఊళ్లో అతనికి 'ఉక్కు భీముడు' అని పేరు. పద్దెనిమిది దాటుతున్నా కన్యగా మణెమ్మ నిర్భయంగా తిరగ్గలుస్తున్నదంటే భీముడుండబట్టే. భీముడు మణెమ్మను ఎత్తుకొని తిప్పి ఆడించినవాడు. తండ్రి తర్వాత తండ్రిలాగా, పాలేరుగా మణెమ్మ బాగోగులన్నీ చూసుకుంటున్నాడు. అతని భార్య నూకి ఇంటిపనంతా చూసుకుంటుంది. వాళ్లు కింద వసారాలో ఉంటారు. తక్కువవాళ్లను చేరదీసినందుకు కులం వాళ్లు ఆ ఇంటిని వెలివేశారు. కులంతో నాకు పనిలేదు, నా కూతురికీ ఉండబోదు, వాళ్లలాగే ఉండాలి! అనేవాడు ప్రెసిడెంటు— మణెమ్మ తండ్రి....

"చూసేనమ్మా చూసేను.... ఏం చెప్పేది, కింద ఏదో పదం లాటిది రాసుంది గాని, ఆ పటం మాత్రం అచ్చంగా నువ్వంటే నువ్వే మణెమ్మా!", అన్నాడు భీముడు.

ఉండబట్టలేక మణెమ్మ సద్దుమణిగేక ముసుగు కప్పుకొని బొమ్మల పందిరికి వెళ్లింది. ఆ రాత్రి అమ్మోరి జాతర ఊరేగింపుంది, ఆ జనం చూస్తారని

దీపాలుంచారు. ఒకరిద్దరున్నా మణెమ్మ నెవరూ పోల్చుకోలేదు.

'ఎవ్వరికోసం.... చెలిమందహాసం' చిత్రాన్ని బాగా పరీక్షగా చూసి వెళ్లింది మణెమ్మ.

ఆ రాత్రే బొమ్మల పందిరికి నిప్పంటుకొని కాలిపోయింది.

చాలా బొమ్మలు మసిమసి అయిపోయాయి. వాటిలో మణెమ్మది అనిపించుకున్న.... చెలిమందహాసం చిత్రం ఒకటి.

కాలిపోకుండా దక్కిన వాటిలో తాను సరదాకి వేసుకొన్న చిత్రాలుండడం ఆషాఢకి పరమానందం అయింది. మిత్రబృందం మాత్రం చాలా విచారించారు. మర్నాటి ఉదయానికి అంతా శుభ్రపరిచి మిగిలిన చిత్రాల్ని ఆరుబయల్లో పందిరి రాటలకి తీర్చిపెట్టారు.

కళాఖండాల ప్రదర్శన గురించి ఎక్కడా వినిపించలేదు గాని, ఆనాటి ముగింపు సన్మానాల సభకి వచ్చినవాళ్లు ముందు బొమ్మల పందిరి మిగిలిన చిత్రాల్ని చూసి చూసి మరీ సభకి వెళ్లారు.

ఆ సభలో ఒక ప్రముఖుడు– అందరికీ తెలిసేది కళాఖండమే కాదు! కళాఖండాల దుర్నిరీక్ష్య కాంతిపుంజంలో చెత్త చిత్రాలు తుక్కుతుక్కుగా భస్మీపటలం అవుతాయి!– అని సుదీర్ఘ గంభీరోపన్యాసం చేసాడు.

ఆ మర్నాడు ఆషాఢను తీసుకు రమ్మని మణెమ్మ భీముణ్ణి పంపింది. ఆషాఢ జడిసి కాదుగాని దుమారానికి గురిఅయిన మణెమ్మను చూడాలని వెళ్లాడు. చూశాక ఊరు అనుకున్నది సబబే అనిపించింది.........

—ఇదీ జరిగిన సంగతి....

* * *

పక్కగదినుండి ఏవో పట్టుకొని మణెమ్మ వచ్చింది.



వస్తూనే నాలుగు పెద్దనోట్లు ఆషాఢకి అందిస్తూ, "మనకి మెడ్రాస్‌కి రెండు టిక్కెట్లు తియ్యాలి!" అంది. ఆషాఢ చెయ్యి వెనక్కి లాక్కున్నాడు.

"మనకి అంటే!!...."

"మనకి అంటే మనకే!...." నీకు మెడ్రాసు బాగా తెలుసునంటగా, నే సినేమాల్లో జేరతా! సాయం జెయ్యాలి!"

"ఏవిటీ!!.... అమాంతంగా సిన్మా తారవై పోదామనే!?!!" నవ్వాపుకొంటూ అన్నాడు.

"ఏం? కాకూడదా? నా పూర్తి పేరు నూకమణి, మణి, మణెమ్మ అన్నారు, తిక్కమణి అనీ అన్నారు. సినిమాలో జేరి– 'చిత్రమణి'– అనిపించుకుంటా! ఇపుడు పందిర్లో జూసినవాళ్లే అపుడు గోడగోడ మీదా చిత్రమణిని చూసి మణెమ్మ మణెమ్మ అని ఊరంతా మారుమోగిపోవాల– చిత్రమణి పేరు బాగుందా?...."

"అహ! బ్రహ్మాండంగా ఉంది, ఇంత మంచి పేరు యింతవరకు ఎవరికీ తట్టలేదేమా అని...."

"ఇదుగో! సూడు!" అంటూ మణెమ్మ పాత సినిమా వారపత్రిక వెనకట్టబొమ్మ ఎత్తి చూపింది. అది ఒక ప్రసిద్ధ తారామణిది. చెట్టు బోదెను



అనుకొని మందహాసం ఒలికిస్తున్న వర్ణచిత్రం. అషాడ చకితుడైయ్యాడు.

"ఇదేకదూ నువ్వు గీసింది?...."

"భలే మణెమ్మా! నిన్ను మనసారా నీ తెలివికి మెచ్చుకుంటున్నాను!" అని అషాఢ అంటూంటే,

"అద్దిగదీ! అలా దారికిరా! మెచ్చుకో కేంజేస్తావులే!" అని మణెమ్మ మనసులో అనుకుంది.

"అదే! ఆ బొమ్మకే పల్లెముస్తాబులన్నీ నా కుంచె తగిలించింది. అది మణెమ్మ బొమ్మ అవుతుందని తెలిసింది కాదు– ఇదీ అసలు నిజం!.... అంతా ముందే కనిపెట్టేసి దాచావన్నమాట!" అన్నాడు అషాఢ.

"ఓ సినిమా యిస్టారుకి నాటు ముస్తాబులు చేస్తే నేను అయ్యేను, మరి నేను యీ పట్నూరు వేషం, ముక్కుకాడలూ, ముస్తాబులూ లాగిపారేసి అలాంటి గాజుకోగ్గడితే ఆ తారమ్మడు లాగే ఉంటానా లేదా?"– అయిదుకి అయిదు కలిపితే పది అయినప్పుడు పదిలో అయిదు లాగేస్తే అయిదవదూ? అన్నంత తేలిగ్గా అడిగింది మణెమ్మ.

".... మరి మాటతీరో?"

"బోల్డు సినిమాపత్రికలు సదూతూన్నా! ఆ మాత్తరం తెల్దనుకున్నావా? మనిసి నిండుగుంటే సాలు, గొంతు ఎరువిస్తారటగా!"

"చదువుతావన్నమాట...."

"ఎనిమిద్దాకా సదివేను...."

"మరి తలకాయ కూడా ఎరువిస్తారా?"

"ఏవోఁ గాని, నా తలకాయ నీ కగపడ్డంలేదా?"

".... నటించడం, నాట్యం? అవన్నీ యీ బురదకోట అమ్మాయి మణికి ఎక్కణ్ణించి వస్తాయి?"

అటి సంగతి తర్వాత సూదొచ్చు గాని, వాడపళనీలో అళాగర పెరుమాళ్ళ గుడెనక సందులో ఉన్నాదంట, అప్పుడప్పుడు తెరమీద జనం గుంపులో కనపడతా ఉంటాడు, ఇంకా యెట్టించవా పప్పన్నం అంటూ ఉత్తరాలేస్తుంటాడు, సినతాత అవుతాన్లే, ఆ తాత నిన్ను సూడాలి!.... సూదొద్దా మరి...."

"ఆఁ! నన్నా?.... నువ్వు.... నన్ను .... నన్నా?!"

"ఏం! నువు మంచోడివి కావా! మరోడైతే గప్పిప్పిగా డబ్బుచ్చుకుని నా నగానట్రా సూసి రెండేలగువుల్లో లాక్కుపోడూ?...."

"మణెమ్మా!...బాగా ఆలోచించు!..."

"అమ్మా బొమ్మాను, మణీ అను సాలు, అసలే నేను తిక్కమణిని, ఎంతంటే అంతే! టిక్కెట్లు తియ్యి!"– అని అజ్ఞాపనో, మంత్రమో, మరి.... అంతా చకచకా జరిగింది.

"అరి! నువ్వట్రా సూరిబాబూ! ఎంతోడివైనావు!...." అన్నాడు తాత, అషాఢను పట్టిపట్టి చూశాక. ఇంత చక్కెర తీసుకొచ్చి అషాఢ నోట్లో కుక్కాడు.

"మణెమ్మా! యారో అనుకుంటివి, మీ అమ్మకి తమ్ముడవుతాడు. నువ్వు పుట్టిందప్పుడే యితగాడికే నిన్ను యిచ్చుగుంటానంది, పటాలు బొమ్మలు గీస్తావేందిరా అని నాయిన, నా సిన్నన్న, సెద్ద తిడితే అలిగి ఇల్లొదిలి పారిపోయిండు, పత్తా దొరక్కుండా.

ఇతగాణ్నెతుకుతూ వొచ్చి నే నిక్కడికి జేరుకున్నా– ఇన్నాళ్ళకి నీ సేతికే సిక్కాడన్నమాట!" అన్నాడు.

తొలిసారిగా మణెమ్మ సిగ్గుపడింది.

ఏకాయేకిని తిరపతికి రమ్మని భీముడికి తంతివచ్చింది. మిత్రబృందంతో కలిసి భీముడు, నూకి వెళ్ళారు.

సిన్మాల్లో జేరడం సంగతి మర్చిపోయింది మణెమ్మ. మూడుముళ్ళూ వేయించుకొంది.

* * *

"గురువుగారి దర్శనాలు బొత్తిగా లేవు!" అని ఒకరంటే మిగతా మిత్ర బృందం అన్నారు. "ఇప్పుడంతా అషాఢ మణీయం మరి.... అషాఢమణీయం!" అని.

———